క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న విప్ ఉదయభాను



పెనుగంచిప్రోలు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మవారిని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు చేశారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. పూజల్లో నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, సర్పంచి వేల్పుల పద్మకుమారి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, నాయకులు కాకాని పద్మ, దేరంగుల శ్రీనివాసరావు, అంగజాల కాశీరాజ్, తమ్మిశెట్టి సోమయ్య, పచ్చల శివప్రసాద్, ఎం.సైదులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బందికి అవగాహన



నందిగామ: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి కౌంటింగ్ నిర్వహణపై సోమవారం పట్టణంలోని కె.వి.ఆర్ కళాశాల ఆవరణలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ.రవీంద్రరావు పర్యవేక్షణలో పలువురు మాస్టర్ ట్రైనీస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ నిర్వహణలో పాటించాల్సిన ఆయా అంశాలపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నందిగామ తహసీల్దార్ సరస్వతి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో పోలీసు కవాతు



జగ్గయ్యపేట: ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలవడనుండటంతో నియోజకవర్గంలో అల్లర్లు జరగకుండా నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ ఆధ్వర్యంలో సోమవారం కవాతు నిర్వహించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల నేపథ్యంలో ఎవ్వరూ కూడా సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. పటిష్ట పోలీసు బందోబస్తు చర్యల్లో భాగంగా మొబైల్ టీంలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సీఐ పరమేశ్వరరావు, ఎస్ఐలు సతీష్, పద్మారావు, సూర్యభగవాన్, పోలీసులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెటింగ్

వీరులపాడు: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో వీరులపాడు మండలంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాలైన జుజ్జూరు, బోడవాడ, జమ్మవరం, పెద్దాపురం గ్రామాల్లో సోమవారం పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఘర్షణలకు దిగేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నందిగామలో మాక్ డ్రిల్



నందిగామ: పట్టణంలోని గాంధీసెంటర్‌లో సోమవారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ హనీష్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. హనీష్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అందరూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై పండుదొర, పోలీసులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లకు పోలీసుల సూచనలు

నందిగామ : ఎన్నికల కౌంటింగ్‌లో అన్ని పార్టీల తరఫున ఏజెంట్లుగా పాల్గొనేవారు కౌంటింగ్ సమయంలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే ఏజెంట్లకు, పార్టీ నాయకులకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే ఏజెంట్లు పాటించాల్సిన ఆయా ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. కౌంటింగ్ ఏజెంట్లు, పోలీసులకు సహకరించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్సై పండు దొర పాల్గొన్నారు.

నేడే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జగ్గయ్యపేటలో 13మంది పోటీ
- నందిగామ బరిలో 9మంది అభ్యర్థులు
- ఓట్ల లెక్కింపునకు మూడంచెల భద్రత

జగ్గయ్యపేట/నందిగామ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరికొద్ది గంటల్లో వెల్లడికానున్నాయి. మే 13వ తేదీన ఎన్నికల పోలింగ్ నిర్వహించగా ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభంకానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను అనంతరం ఈవీఎంల్లోని ఓట్లను పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కించనున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 222 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఓట్ల లెక్కింపు 16రౌండ్లలో పూర్తవుతుంది. జగ్గయ్యపేట ఓట్లలెక్కింపు ఇబ్రహీంపట్నం సమీపంలోని నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల, నందిగామ ఓట్ల లెక్కింపు నోవా ఇంజినీరింగ్ కాలేజీలో జరుగనుంది. ఇందుకోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ ఎన్నికల్లో జగ్గయ్యపేట నియోజకవర్గంలో జిల్లాలోని అత్యధికంగా 89.88శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,05,364ఓట్లకుగాను 1,84,575మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2,335మంది, హోం ఓటింగ్ ద్వారా 146మంది ఓటేశారు. నందిగామ నియోజకవర్గంలో 88.58శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,05,480మంది ఓటర్లు ఉండగా, 1,79,952మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పోస్టల్, హోం ఓటింగ్ ద్వారా 2210మంది ఓటియ్యగా, సైనికదళాల్లో పనిచేస్తున్న 15మంది సరీ్వసు ఓటర్లు కూడా ఓటేశారు. ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పటిష్ట బందోబస్తు చేపట్టారు.



నందిగామ కౌంటింగ్ జరిగే నోవా కాలేజీ



నిమ్రా కాలేజీలో చేసిన కౌంటింగ్ ఏర్పాట్లు

నందిగామ ప్రాంతంలో భారీ వర్షం



పిడుగుపాటుకు సోమవరం గ్రామంలో దెబ్బతిన్న ఇంటి పైకప్పు గోడ



ఈదురు గాలులకు నేలరాలిన మామిడికాయలు

నందిగామ: నందిగామ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. రాత్రి 11:20 సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు గంటసేపటివరకు భారీ వర్షం కురిసింది. వర్షం కురుస్తున్నంతసేపు ఉరుములు, మెరుపు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. మండలంలోని సోమవరం గ్రామంలో పిడుగుపడటంతో ఓ ఇంటి గోడ దెబ్బతింది. ఈదురు గాలులకు మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి. అర్ధరాత్రి ప్రారంభమైన వర్షం దాదాపు ఉదయం వరకు కురుస్తూనే ఉంది. వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో పట్టణ ప్రజలు సేదతీరారు. నందిగామ ప్రాంతంలో 84.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి

మంగొల్లు(వత్సవాయి) : పిడుగుపాటుకు ఓ పాడి గేదె మృతిచెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి మంగొల్లులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నల్లమోతు వెంకటేశ్వర్లు నాలుగునెలల కిందట రూ.80వేలు వెచ్చించి పాడిగేదెను కొనుగోలు చేశారు. ఆదివారం అర్ధరాత్రి కురుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపడటంతో వెంకటేశ్వర్లుకు చెందిన గేదె మృతి చెందింది. విషయం తెలుసుకున్న వీఆర్వో ఈ మేరకు అధికారులకు నివేదికను అందించారు.

జగన్ సీఎం కావాలని ప్రత్యేక పూజలు

కృష్ణలంక(విజయవాడతూర్పు):దేవుడి దయ, ప్రజలిచ్చిన చరిత్రాత్మక తీర్పుతో ఐదేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిందని, కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా ప్రతి కుటుంబానికీ మంచి చేసి ప్రజలందరి దీవెనలతో మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం కావాలని, తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా అభ్యర్థి దేవినేని అవినాష్ గెలవాలని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి పులిపాటి దుర్గారెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ సోమవారం దేవస్థానంలో అమ్మవారికి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు ఇచ్చినట్లు తెలిపారు.

శ్రీ భవానీ శంకర స్వామివారికి 108 కలశాలతో అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో మరకత పోలిన శ్రీ భవానీ శంకర స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. శ్రీ భవానీ శంకర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తయిన దృష్ట్యా విశేషంగా మండలాభిషేకం, 108 కలశాలతో పంచామృత అభిషేకం, రుద్ర హోమం వేదపండితులతో శాస్త్రోక్తంగా జరిగింది. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు, దాత లక్ష్మణ రెడ్డి పూజా కార్యక్రమాలలో పాల్గొని పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కె.చంద్రశేఖర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అకట్టుకుంది. సోమవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు కీర్తనలకు కళాబృందంలోని సభ్యులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళా బృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

కౌంటింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సామినేని ఉదయభాను



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

ప్రభుత్వ విప్ ఉదయభాను



శిక్షణ తరగతులకు హాజరైన కౌంటింగ్ ఏజెంట్లు

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత కీలకమైన ఓట్ల లెక్కింపులో పాల్గొనే వైఎస్సార్ సీపీ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సూచించారు. వైఎస్సార్ సీపీ తరఫున విజయవాడ పార్లమెంటు, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లకు సోమవారం సాయంత్రం స్థానిక సీతారామపురంలోని కొత్త కల్యాణ మండపంలో ఓట్ల లెక్కింపుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పోలింగ్ సమయంలో అందరూ కష్టపడి పనిచేశారంటూ పార్టీ క్యాడర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఏజెంట్లు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం 5గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతి రౌండ్‌లో నిర్వహించే ఓట్ల లెక్కింపును నిశితంగా పరిశీలించడంతోపాటు ఏవైనా అనుమానాలు ఉంటే ఎన్నికల అక్కడికక్కడే నివృత్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. పోస్టల్‌బ్యాలెట్ విషయంలో దేశంలో ఎక్కడాలేని విధంగా ఏపీ ఎలక్షన్ కమిషన్ వ్యవహరించిన తీరు విస్మయానికి గురిచేస్తోందన్నారు. ఎలాంటి సంతకాలు, సీలు, అటెస్టేషన్లు లేకపోయినప్పటికీ ఓట్లుగా పరిగణించాలని ఎన్నికల కమిషన్ పేర్కొనడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో ఏజెంట్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

2019 ఫలితాలే పునరావృతమవుతాయి..

ఏజెంట్ల శిక్షణా కార్యక్రమానిఉద్దేశించి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2019ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఈసారి కూడా పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించనుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఏజెంట్లకు ఏదైనా సందేహం, అనుమానం ఉంటే ఆర్వో సంతకం చేయకముందే వారి దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఆర్వో సంతకం చేసిన తరువాత ఎవరూ ఏమిచేయలేరనే విషయాన్ని ఏజెంట్లు గమనించాలని సూచించారు. ఏజెంట్లు అనుక్షణం సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, శ్రీనివాసగౌడ్, కనకపూడి భాస్కరరావు, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గాదెల రామారావు, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల బాబు, న్యాయవాది సామినేని వెంకటేశ్వరరావు, కౌంటింగ్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన కౌంటింగ్ సిబ్బంది



మాట్లాడుతున్న కౌంటింగ్ అబ్జర్వర్ సాగర్

జగ్గయ్యపేట: ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కళాశాలలో మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌంటింగ్ సిబ్బందికి సోమవారం శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా కౌంటింగ్ అబ్జర్వర్ సాగర్ మాట్లాడుతూ సిబ్బంది ఉదయం ఆరుగంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు ఉంటుందన్నారు. అనంతరం 222 పోలింగ్‌కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్వో వెంకటేశ్వర్లు, ఏఆర్వో శేషగిరి, మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా కౌంటింగ్ ఏర్పాట్లు



సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి నిమ్రా, నోవా కళాశాలల్లో మంగళవారం కౌంటింగ్ నిర్వహించనున్నారు. కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు ప్రత్యేక ప్రణాళికతో పకడ్బందీగా కౌంటింగ్‌కు సిద్ధమయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









పేదలకు సేవలు మరింత విస్తృతం చేయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ):రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సుబ్బారావు రావూరి (దత్త) అధికారిక పర్యటన సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి ఆధ్వర్యంలో గొల్లపూడిలోని దత్త కల్యాణ మండపంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు పేద కుటుంబాలకు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు, పేద విద్యార్థులు పది మందికి స్కాలర్‌షిప్‌లు అందచేశారు. అదే విధంగా పోలియో ఫండ్ కింద రూ.25 వేలు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సభ్యులు పేదలకు అందించే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కోవిడ్ కష్టకాలంలో రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి సభ్యులు వివిధ రూపాలలో అందించిన సేవలు మరుపురానివని గుర్తు చేశారు. కుల, మతాలకు అతీతంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి సాయం అందించినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పార్థసారధి, రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి అధ్యక్షులు ధనేకుల భరత్ కుమార్ పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో సోనికా ప్రతిభ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఓపెన్ ఫైడ్ చెస్ టోర్నీలో రాణించిన రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని డి.సోనికా భవిష్యత్తులో మరిన్ని టోర్నీలలో రాణించి నగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని స్కూల్ డైరెక్టర్ ఎన్వీ.రావు ఆకాంక్షించారు. కేఎల్ రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెస్ టోర్నీలో రాణించిన సోనికాను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎన్వీ రావు మాట్లాడుతూ సోనికా అద్భుత ప్రతిభను కనబర్చి మూడో స్థానంలో నిలిచిందని కొనియాడారు.

కొనసాగుతున్న శిక్షణా శిబిరం



త్రిభుజాల గురించి వివరిస్తున్న టీచర్ ప్రసాద్‌బాబు

కంచికచర్ల : నేటి విద్యార్థులు, యువత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. శిబిరంలో భాగంగా విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, పుస్తక పఠనం, యోగా, నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, కవి,రచయిత నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, డాన్స్ మాస్టర్ వేల్పుల ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి విద్యార్థుల నుంచి విశేషస్పందన లభిస్తోంది. శిక్షణ తరగతుల్లో భాగంగా 16వ రోజు సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, బొమ్మలు తయారుచేయడం తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబు గణితంలోని అంశాలను వివరించారు. ఉపాధ్యాయుడు వినోద్‌బాబు క్విజ్ పోటీ నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, పిఈటి మణిరత్నం, వర్షిత, సిబ్బంది శ్యామల, సత్యవతి, రమేష్ పాల్గొన్నారు.

పోలీసులతో ప్రత్యేక మొబైల్ టీమ్‌ల ఏర్పాటు



శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని ఎస్ఐ కోరారు.

పెనుగంచిప్రోలు: ఎన్నికల ఫలితాల వేళ కవ్వింపు చర్యలు, అల్లర్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.రాంబాబు సోమవారం హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరుగనున్న నేపథ్యంలో మండలంలో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందుకోసం మండలంలో ప్రత్యేకంగా ఐదు మొబైల్ వాహనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీసు సిబ్బందితో కూడిన ఈ వాహనాలు మండలంలోని ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తుంటాయని వివరించారు. 144వ సెక్షన్ అమలులో ఉన్నందున, ప్రజలు గుంపుగా ఉండకూడదన్నారు. ఫలితాల అనంతరం ర్యాలీలు, సభలు, డీజేలు పెట్టటం, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమించి అల్లర్లకు పాల్పడితే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com